


# శాంతి

పాలకోడేటి సత్యనారాయణరావు

తలుపు తట్టిన చప్పుడు విని వెళ్ళి విసుగ్గా తలుపుతీశాను.

తలుపు తీసేసరికి నా ఆ విసుగు నాకే ఆశ్చర్యం కలిగించేటట్లుగ ఏమయిందో ఏమో! ఆ క్షణంలో మనసెందుకో ఆనందంతో ఉరకలు వేసింది.

తనవారిని చూస్తే ఈ మనసెందుకో అంతగ ఉత్సాహంతో ఎగిరి పడుతుంది!

ఇంతకీ వచ్చింది శాంతి తమ్ముడు!

ఛ— వీణ్ణలా అనకూడదనుకున్నాను చాలసార్లు!

కానీ నా మనసు నా అదుపులోఉండటం ఈ జన్మకిక తీరనికోరికే!

'రా రా లోపలికి!'

ఆప్యాయత అరవైపాళ్ళు, అనురాగం ఇరవైపాళ్ళు.

మిగతా ఇరవై ఆశ్చర్యానికే అంకితం.

ఈ వెధవ ఎందుకు రావాల్సి వచ్చింది హైదరాబాదు?

ఎక్కడి కంకిపాడు? ఎక్కడి హైదరాబాదు??

వాడు ఈసురోమంటూ లోపలికి వచ్చాడు.

'బావా!'

'బావా!' — రాగయుక్తంగనే అన్నాను నేను.

పకాలున నవ్వాడు వాడు — 'పాడకురా బావా!'

'అభయం ఇచ్చానురా!'

'నా క్కావల్సింది అభయం కాదురా, కాఫీ!'

'అదీ ఇస్తానుగానీ...ఏమిటి విశేషం?'

'ఏమీలేదు—'

అబద్ధం ఆడకూడదంటారు, తెలిసి మరీ ఆడనే కూడదంటారు.

కానీ — వాడికి తెలుసు అబద్ధం ఆడుతున్నట్లు.

అయినా జంకు గొంకూ లేక అబద్ధం ఆడేశాడు. అంతకన్న విశేషం — వాడు చెప్పిన ఆ అబద్ధాన్ని పచ్చి నిజమన్నట్లుగ నేను భావించినట్లు నటించటం!

నిజమే! వీడికిది అబ్బపోలిక!

ఎన్ని అబద్ధాలాడితే ఆరుగురు ఆడపిల్లల తండ్రి కాగలడనేది ప్రశ్న!

అనేశాను అదే—

'మనసులోది నువ్వు దాచుకోవురా!' నవ్వుతూ అన్నాడు వాడు

ఇది కామెంటో, కాంప్లిమెంటో నాకింకా తెలియలేదు.

ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి ఇచ్చాను. మారుమాటడక తాగాడు.

'నిద్ర వస్తోందిరా బావా!' అన్న పది నిమిషాలకు వాడు గురక నిద్రలో ఉన్నాడు.

నాకు అసూయవేసింది— నిద్ర రావాలి అనుకోగానే పడుకోగలిగిన వాళ్ళు ఎంత అదృష్టవంతులు! నేను నిద్రపోవాలంటే ముందు పెద్ద తతంగం—ఆరోజంతా అడ్డగాడిదలా ఎండలో తిరిగి అలిసిపోవాలి. లేక

పోతే అలావెళ్ళి ఒక టీ తాగిరావాలి. లేకపోతే కనీసం ఓ గంటసేపు మూసిన కన్ను తెరవకుండా పడుకునే ఉండాలి. అప్పటికి నిద్రపట్టితే పట్టొచ్చు!

బహుశా—ఇది అబద్ధమాడే వాళ్ళకుగల అడిషనల్ క్వాలిఫికేషనేమో!

ఏమో!—నాకు తెలియదు.

నేను జీవితంలో నిజం ఒకసారి చెప్పాను. అంతే! నిద్రపట్టడం మానేసింది ఆ తర్వాత.

'నిజం చెబితే నిద్రరాదు' అనుకున్నాను.

కానీ, అబద్ధాలాడగలిగితే నిద్రవస్తుందన్నది తెలియలేదు.

ఇకమీదట అబద్ధాలాడి చూడాలి.

అదో క్రేజీ అంతే!!

ఈవెధవ—వీడిపేరు శ్రీహరి, అయినా ముద్దుగా వెధవా అనడమే అలవాటు. వాడికి నేనూ అంతే అనుకోండి—నిద్ర లేస్తే బాగుణ్ణు.

విశేషాలు తెలుస్తాయి'

అసలు విశేషాలేమైనా శేషించి ఉన్నవా అని!

శేషగిరి నాకు చెప్పింది విశేషం—విశేషాలు సశేషంకాకుండా చెప్పినవార్త అది! నన్ను అనుకోనంత గక్కుంగదీసింది కూడాను.

'మహాలక్ష్మి చచ్చిపోయింది'—ఇంతే ఆ వార్త!

కానీ ఎంతటి విషాదం నిండుకొని ఉంది!

మహాలక్ష్మి—

నిజానికి నాకు నవ్వొస్తుంది—మహాలక్ష్మి నాచుట్టమా? కాదు నాకు బాగ తెలిసిన వ్యక్తి అంటే అదీకాదు.

కానీ—ఆవార్త నన్ను విపరీతంగా కలవర పెట్టింది.

మహాలక్ష్మిగురించి విన్నపుడు నాకు అనిపించలేదు—ఈవ్యక్తి నా జీవితంలో, ముఖ్యంగ శాంతివల్ల, ఒక ప్రధానపాత్ర వాగలదని! ఏదో ఉబుసుపోకకువిన్న కబుర్లవి. ఆ వార్తలకు అంతకన్న ప్రాముఖ్యాన్నివ్వటం—అప్పట్లో—తెలివితక్కువే!

'చూడు బావా! మహాలక్ష్మి చచ్చిపోతుందిట!' నవ్వుతూ అనేది శాంతి.

'ఏం?' విచారంకన్నా వివరణ కోరటమే అధికం'

'ఏం ఏమిటి? ఒళ్ళుపొగరు అంతే!' అని నాతో అనేసి—'అంతేకదుటే?' అని అడిగేది మహాలక్ష్మిని.

'పొండి, మీరు మరీను ఏదన్నా ఏలా కోలంగనే మాస్తారు' అనేది మహాలక్ష్మి చేస్తున్న పనిలోంచి తలైనా ఎత్తకనే!

పనిమనిషి—మహాలక్ష్మి—వెళ్ళిపోయాక చెప్పింది శాంతి— 'వాణ్ణి చేసుకుంటానని తనంటే నాన్న వద్దంటాడుట. ఎవరికో ఇవ్వాలని యత్నం ఆ ముసిలాడిది. అంతే—ఇదీ ఓ పెద్ద ప్రేమపక్షే!'

అసలు జగత్‌లో ప్రేమ పక్షి గాని దెవరు ?

ప్రేమ అనే పదం నా జీవితంలోకి తొంగి చూడలేదు అని ఎవరైనా చెప్పగలరా అంటే ఎవ్వరూ ఉండరేమో!

ఏదోవిధంగా ప్రతివాడి జీవితంలో ఒక్కసారైనా పలుకరించి పోతుందిది!

ఆ పలకరింత కొందరికి పులకింతలనిస్తే మరికొందరికి కలవరింతలు ప్రసాదిస్తుంది. అంతే తేడా!

శ్రీహరి లేచాడు ఆవలిస్తూనే—

'బజార్లోకి వెళ్ళాలి, తయారవరా!'

'ఎందుకని ? అందామనుకొని ఆపుకొన్నాను నేను. వెడితే అదే తెలుస్తుంది.

స్టేషనరీ షాపులోకి వెళ్ళాము అటూ యిటూ తిరిగి.

'శెలెక్టు డిజైన్స్ వెడ్డింగ్ కార్డ్సు ఉంటే చూపించు.'

ఆశ్చర్యపోయాను—వెడ్డింగ్ కార్డ్సా?

'ఎవరికిరా ?'

'ఎవరికేమిటి నీ మొహం! మనకే!' శ్రీహరి జవాబు ఇది.

తెల్లపోయాను నేను—'మనకి' అంటే?

షాప్ వాడు వకాలున నవ్వాడు— 'పారీ సర్'

వాడికేసి చూసి తనూ నవ్వాడు శ్రీహరి. క్షణం తర్వాత, తేరుకొని నేనూ నవ్వాను.

'మంచి డిజైన్ సెలెక్టు చేయరా'

ఇంకేమీ ప్రశ్నించకుండా నే నాకు తోచింది తీశాను. వాడికీ అదే నచ్చినట్లుంది—పాక్ చేయించాడు.

ప్రెస్ దగ్గరకు రాగానే అన్నాడు శ్రీహరి—'బావా! ఈ మేటర్ ప్రింట్ చేయించాలిరా!'

అందించిన కాగితం మడత విప్పి చూశాను. ఏదో శుభలేఖార్థములు!

చదివాను—నిజమే!

శాంతి పెళ్ళి!!!

నేను పొరబడలేదు. నా ఇంద్రియాలు ఇంకా నన్నే మోసగించటం లేదు.

వరుడెవరో వీరభద్రరావు!

'అదిరా సంగతి' అన్నాడు వాడేదో నాకు చెప్పినట్లుగ.

ఆ కాగితం అందించగానే తెలియజేయటం పూర్తయిం దనుకున్నాడు.

అసలు ఆ కాగితం అందుకొన్నాకనే నాకు ఏమీ తెలియదన్న సంగతి తెలిసింది.

ఇలా ఎలా జరుగుతోంది ?

ఎందుకు జరుగుతోంది ?

బెజవాడ వెళ్ళి ప్రింట్ చేయించుకు రమ్మన్నారు. నేను నీ కోసం హైదరాబాదుకు వచ్చాను.

ఎంత విశ్వాసం వీడికి!

ఈ మాత్రం నమ్మకం మామయ్యకు నా మీద ఉంటే ఎంత బాగుండేది!

ఫిబ్రవరి ఆరున పెళ్ళి: ఈవేళ జనవరి ఇరవై.

ఇంకా పదిహేనురోజులు.

అంతే! —ఆ తర్వాత ఎవరో 'శాంతి' అయిపోతుంది.

ఎవరి మనసులోనో దేవతగ—

ఎవరి ఇంట్లోనో దీపంగా—

అంతే—నా జీవితం ఎంత చీకటిగా మారిపోతుందో అని తెలుసుకోకుండానే వెళ్ళిపోతుంది.

ఈ ఇంటి దీపాన్ని ఆర్పేస్తూ, వేరొక ఇంట్లో దీపం పెడతాననటం నిశ్చయంగా బాగలేదు.

'కానీ అదేం చేస్తుందిరా బావా!'

'అంటే?'—నిజంగానే నాకర్థం కాలేదు శ్రీహరి మాటలు.

'పురుషుడే తనకు కావల్సింది చొరవ చేసుకొని తీసుకోవాలని ఏ స్త్రీ అయినా కోరుకుంటుంది. తనకెంత ఆదుర్దా ఉన్నా నిబ్బరంగానే కనిపిస్తుంది, అంతేరా, ఇక నీ యిష్టం!'

నాకు అర్థం కాలేదు. ఏమిటి వీడి వాద ?

'నువ్వుత్త ఫూల్‌విరా బావా!' శ్రీహరి ఒళ్ళు మండి అన్నాడు

నాకు తెలియదు నేనెంత ఫూల్‌నో!

మౌనంగ ఊర్కొన్నాను.

నా మౌనాన్ని వాడెలా అర్థం చేసుకొన్నాడోగానీ చాలాసేపు తర్వాత అన్నాడు—'శాంతి నిన్ను రమ్మంది రా!'

'పెళ్ళికేనా? తప్పకుండా వస్తాను. ఫిబ్రవరి నాలుగుకే వచ్చేస్తాను.' మనసులోని ఆవేదనను అణుకొంటూ అన్నాను

శ్రీహరి నాకేసి ఓసారి చూసి తల దించుకొని అన్నాడు — 'అయాం సారీరా బావా! నాకేగనుక అధికారం ఉంటే శాంతి నీదే అయేది!'

నాకిపుడర్థం అయింది — ఫూల్‌ను నేను కాదు, శ్రీహరే ఉత్త ఫూల్!

* * *

ఫిబ్రవరి నాలుగుకే అనుకున్నట్లు కంకిపాడు చేరాను. అంతా సందడితో నిండిపోయింది. ఆ ఇంటికే పెళ్ళి కళ వచ్చేసినట్లనిపించింది.

నా ఊహకు నవ్వొచ్చింది నాకే — నా ఒక్కడి మనసులో ఏదో బాధ చెలరేగుతున్నంత మాత్రాన, వివాహమండపంలోనే పెళ్ళి కళ గోచరించదనుకోవటం వెర్రితనం.

నా కోడి కుంపటి లేకనే తెల్లారిపోతోంది.

అదే నాబాధ కూడాను!

ఏం చేయాలో తోచక అలా శేషగిరి ఇంటికి బయలుదేరాను.

శేషగిరి వాళ్ళమ్మగారు కనబడి పలుకరించారు—అది పలుకరింపనుకోవటం ఆత్మవంచనే తప్ప మరొకటి కాదు.

అది నిస్సందేహంగా పరామర్శ చేయటమే!

—ఆత్మీయులెవరైనా మరణిస్తే, ఎవరో వచ్చి పలికే సానునయ వాక్యాలలాటివి!

—అవి నీకున్న బాధను తొలగించవు సరిగదా, సింహావలోకానికి మాత్రం మార్గం అవుతాయి.

'శాంతి పెళ్ళికి వచ్చావా రాజా!'

మనసు ఒకసారి మసిబారింది.

'ఔనండి— శేషగిరి ఇంట్లో లేడా?'

'ఇట్టా రాజా మాట—ఔనుగానీ, నీకూ మీ మామయ్యకు మాటపట్టింపు వచ్చిందా? ఏం?'

జవాబు చెప్పకపోవడమే మేలు— నిజం చెప్పినా నమ్మి చావదు ఈ లోకం కొన్ని సందర్భాలలో. అలాటప్పుడు అతికేలా అబద్ధం చెప్పాలంటే చేతకాదు!

అబద్ధం చెప్పగలగటం నిశ్చయంగ కళే!

అది బహుశా మామయ్యకు తెలుసు!— ఈ విషయంలో నాకు మేనమామ పోలిక రాలేదన్నది పచ్చి నిజం!

'అలాటి గొడవలేం లేదండి—'

ఆవిడ నమ్మలేదు, తెలుస్తూనే ఉంది

'నిజమేనా? నమ్మమంటావా?'

'నిజమే —' నమ్మమనిమాత్రం అనలేకపోయాను, నమ్మరని తెలుసు గనుక.

ఆశ్చర్యంతో అంది ఆవిడ— 'ఇలా రా రాజా! ఏమీ అనుకోకు ఓమాట అడుగుతా నిన్ను—'

'అడగండి—'

'పట్నంలో ఎవరో పిల్లతో కులుకుతున్నావటగా?— అహ, ఎవరో అనుకోగా విన్నానులే!'

'ఎవరో' ఏం ఖర్మ?—ఇది మామయ్య పనే!

బహుశా అమ్మ ఉంటే గుండె పగిలి చచ్చిపోయేది— మామయ్యకన్నా కొంత డబ్బు విషయంలో లేనివాళ్ళమే కానీ పరువు ప్రతిష్ఠలకుమాత్రం కాదు.

నేను నిజం చెప్పను—దాన్ని నమ్మరు. నిజాన్ని నమ్మకపోవటంకన్న దానికి మనమే విధమైన అవమానం చేయలేము అందుకే మాట మార్చాను.

'శేషగిరి లేడా ఇంట్లో?'

'లేడుగానీ అడిగినదానికి జవాబు చెప్పవేం?'

నేను మౌనంగ ముందుకు సాగాను జవాబు చెప్పకనే.

'నిజమే గాబోలు — పిదపకాలపు బుద్ధులు—' వెనుకనుంచి ఆవిడ అంటూనే ఉంది. నేను నవ్వుకోగలిగాను నిర్మలంగ.

ఇంటికి తిరిగి వచ్చేస్తుంటే శేషగిరి కనిపించాడు. పొలాలవేపు వెళ్ళాము.

'నీకు తెలుసురా ఈ సంగతి?'

వీడడిగేది నాకు తెలుసు. అయినా అడిగాను— 'ఏ సంగతిరా?'

'మహాలక్ష్మి చావలేదురా రాజా!'

ఆశ్చర్యపోయా నేను. శ్రీహరి నాతో చెప్పలేదేం?

'చంపేశారు దాన్ని—' శేషగిరే అన్నాడు మళ్ళీ.

'హత్యా?'

'కాదు, ఆత్మహత్య చేసుకొందిరా — కానీ ఎందుకు అని అడగవేం?'

'కారణం ఊహించుకో గలుగుతున్నాను.'

'అయితే అదే కరక్టు — మనుష్యుల్లో మమతలను, మనసులను ఎందుకు చూడలేక పోతున్నారంటావ్ వీళ్ళు?'

నేనేం జవాబియ్యలేదు.

'మా మామయ్య ఏమంటున్నాడు?' — శేషగిరి నా ప్రశ్నవిని ఆశ్చర్యపోయాడు.

'నీకూ తెలిసిందా?'

'ఇపుడే మీ అమ్మ గారడిగారు.'

శేషగిరి నాకేసి చూశాడు ఆశ్చర్యంగ

'నీకేమీ అనిపించలేదురా?'

'అంటే?' — ఈ సారి శేషగిరి ఏమీ అనలేదు.

'సరేలే, ఇంతకీ మహాలక్ష్మి సంగతి..'

'ఏముందిరా, గంగులుకిచ్చి పెళ్ళి చేయనన్నాడు. చేయకపోతే చస్తానంది. చచ్చి చూపించింది. ఈ వేళ ఏడుస్తాడురా వాడు — గంగులుకన్నా ఇచ్చిచేశాను కాను అని! అంతేరా రాజా! — బ్రతికిన మనిషికి వీళ్ళిచ్చేవిలువ బండి సున్నారా! చనిపోయాకే తెలుస్తుంది వీళ్ళకు వాళ్ళ విలువ! ఏమంటావ్?'

శేషగిరి ఇంతటి నిజాన్ని చెబుతూంటే కాదని ఎలా అనను?

కాదన్నాకానీ—నిజం చావదు!

'మీ మామయ్య ఏమన్నాడురా?'

'ఇంకా కనిపించలేదు.'

'శాంతి?'

'శాంతిని చూడలేదు.'

ఏమిటో వెలితిగఉంది ఈ సంభాషణ. అందుకే అన్నాను—'వెళతానురా!'

'హైదరాబాదుకా?'

'ఛ! పెళ్ళయాకే వెడతానురా—ఇంటికి పోతాం'

'పదరా—నాకే మనసంతా అదోలా ఉంది'

ఇంటికి వచ్చేసరికి పందిరి క్రింద మామయ్య ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

నన్ను చూడగనే ముఖం ఒకసారిగా పాలిపోయినా, లేనినవ్వు తెచ్చుకుంటూ

అన్నాడు—'కులాసాగ ఉన్నావురా ?'

'ఆ—' ఇంక మాట్లాడటం ఇష్టం లేక లోపలికి నడిచాను

లోపలికి రాగానే శ్రీహరి కనిపించాడు —

'ఎంతసేపయింది రావచ్చి ?'

ఎడారిలో ఒయాసిస్ పరిసరాలు ఇంత కన్నా చల్లగ ఉంటాయంటే నేను నమ్మను. మనసు ఆవేదనతో నిండినపుడు ఆప్యాయతతో ఒక మాటంటే చాలు-ఇంకేం వద్దనిపిస్తుంది-కానీ, చల్లనిమాటకు నోచుకునే యోగం ఉండాలి; ఆ అదృష్టానికి పెట్టి పుట్టాలి.

'ఒకగంట దాటిందిరా!'

'అక్కయ్యను కలుసుకున్నావా?'

'లేదు —'

'ఆ గదిలో ఉంది; వెళ్లరా వెడితే!'— అంటూ శ్రీహరి వెళ్లిపోయాడు.

వెళ్లడమా వద్దా అని క్షణకాలం ఆలోచించి మెల్లగ అడుగు వేశాను.

లోపల చాలామంది ఆడవాళ్లు — ఎక్కువభాగం తెలిసినవాళ్లే అయినా — ఉన్నారు. వెనుదిరిగి శ్రీహరి గది చేరుకున్నాను.

'ఏరా వచ్చేశావ్?

'చాలమంది ఆడవాళ్లున్నార్రా!'

'ఔనురా, చెప్పడం మరిచాను, — శాంతిని ఈవేళ పెళ్లికూతురు చేశార్రా!'

సరిగ గురిచూసి గుండెమీద సమ్మెటతో కొట్టినట్లయింది.

ఎంతటి దురదృష్టవంతుణ్ణి నేను!

శాంతి నాది కాకపోతే—శాంతిగ ఎలా బతకగలను?

శ్రీహరి, అన్నదానికి జవాబేమీ లేదు నా దగ్గర.

* * *

రాత్రి పదయింది— బహుశా దాటిందేమో గూడ.

అందరూ భోజనాలు చేసి సావకాశంగ పందిరి క్రింద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. శ్రీహరి, నేను మాత్రం శ్రీహరి గదిలోనే పడుకోవాలని నిశ్చయించుకొని పక్కలమీద పడుకొన్నాము.

నిద్రపట్టడంలేదు— అటూ ఇటూ పొర్లుతున్నాను ప్రక్కమీద.

తలుపు తట్టిన చప్పుడయింది-శ్రీహరి వెళ్లి తలుపు తీశాడు.

శాంతి వచ్చింది.

'బావా!'

తలెత్తి చూశాను నేను.

'నిద్రపోతున్నావా?'

'లేదు '

శాంతి వచ్చి, నా పక్కమీదే కూర్చుంది— ఆశ్చర్యపోయాను.

నవ్వుతూ అంది శాంతి— 'శ్రీహరి వెళ్లిపోయాడు బావా—పందిర్లో కబుర్లు వినడానికి '

'శాంతీ— ఇదేమైనా బాగుందా ?'— అడగడం బాగుండదనిపించినా అడిగాను

'ఏం? ఈ ప్రశ్న నువ్వే వేస్తున్నావా? నా మనసు నిర్మలంగ ఉన్నంతకాలం నా తమ్ముడు నన్ను విశ్వసించే తీరుతాడు ... పైగా నువ్వు ఏం చేయలేవు నన్ను!'

'ఏం?'

'నువ్వు నా మేలు కోరతావు గనుక.'

అందుకే—

ఈ అచంచలమైన విశ్వాసానికే—!

నేను శాంతిని కోరుకునేది!

'మహాలక్ష్మి చచ్చిపోయింది బావా! నీకు తెలుసా?'

'ఆ—అయినా శుభ సమయంలో ఇవెందుకు?' అన్నానేకాని మనసారా అన్నమాట మాత్రం కాదు.

శాంతి జవాబివ్వలేదు.

తలెత్తి శాంతికేసి చూశాను. పసుపు పచ్చని చీరతో వుంది. మోకాళ్లమీద తల ఆన్చుకుని నాకేసే చూస్తోంది. ఆ చూపుల్ని భరించలేక తల తిప్పుకున్నాను.

'బావా! నేను అదృష్టవంతురాలినే గదూ!'

నేనేమీ అనలేదు—అనలేక కాదు— అనడానికి లేక.

'నిజం బావా! రమ్మని కబురు పంపగానే వచ్చావు—ఎల్లుండే నా పెళ్లి—'

ఆ కంఠం నాకు కొత్తగ భాసించింది. ఆ కంఠంలో ఏదో తెలియని వ్యథ ఎక్కడో పలుకుతూనే ఉంది ఈ వాదంలో అపశ్రుతికి చోటు ఎక్కడో ఉండనే వుంది.

'మాట్లాడు బావా! ఏమీ మాట్లాడక నన్నెందుకు చిత్రహింస చేస్తావ్?'

'ఏం మాట్లాడమంటావ్?'

'ఏదయినా సరే—నీ యిష్టం.'

'ఏమీ మాట్లాడలేను శాంతీ! అశాంతిలో కొట్టుకొంటూ పైకి మాత్రం సంతోషాన్ని ఎలా వెలిబుచ్చగలను చెప్పు?'


'కాని బావా, ఇది శుభ సమయం.'

'నిజమే!'

'నిజమా? ఇది నీకు శుభ సమయమేమోగానీ నాకు మాత్రం కాదు. నిజం— తీరని అశాంతితో అల్లాడేకంటే క్షణకాలం శాంతితో జీవించడం మేలు కదా బావా!'

నేనేమీ అనలేదు.

'చెప్పవేం? — శ్రీహరితో చెప్పాను; బావను నేను రమ్మన్నానని చెప్పమని; నువ్వు వచ్చావు బావా—కానీ నేనాశించింది వేరు; నా బావనిలా కాదు నేను ఊహిం



రింది — వకౌనిలా, వర్వసంగ వరిత్యాగిగ కాదు బావా నేను ఊహించుకొన్నది! నా కావలో చీము, రక్తం, ప్రేమ ద్వేషం అన్నీ ఉన్నాయనుకున్నాను అంతే బావా నేను ఊహించింది !'

ఎంత చిత్రమైన పరిణామం ఇది! శాంతి ఇలా ఎలా అనగలుగుతోంది ?

'చెప్పు బావా—మౌనంగ ఉంటే అంగీకరించినట్లే అంటారు. పట్నంలో ని నీకిళ్లు నిజమే అంటారు—నాకు తెలుసు ని వచ్చి అభూతకల్పనలు నాబావ నన్ను మోసం చేయడు. చేయలేడని నాకు తెలుసు'

ఏమిటీ వింత ప్రకృతి?

నానుంచి శాంతి ఏమాశిస్తోంది ?

నాకు అర్థంగావటం లేదు.

మౌనంగా ఊరుకొన్నాను నేనేం జవాబివ్వాలో తెలీక.

శాంతి నా జవాబు కోసం చాలసేపు నిరీక్షించి, చివరకు అంది—'పోనీలే బావా! నా అదృష్టం ఇంతే అనుకుంటాను. కానీ ఒక్కమాట— ఆడదెప్పుడూ ఒకడికే మనస్సివ్వ గలుగుతుంది. ఆ మనసుతో బాటు ప్రాణం కూడ ఇవ్వడానికి సిద్ధంగానే ఉంటుంది '

ఆశ్చర్యపోయాను నేను.

'ఏమిటి శాంతీ — నువ్వనేది నీకర్థమవుతోందా ?'

నవ్వుతూ అంది శాంతి: 'నేననేది నాకర్థమవుతూనే ఉంది. కానీ నీకే అర్థం గావటంలేదు అదే నా బాధ...పోనీలే బావా, ఒక్కటి అడుగుతా, చెబుతావా?'

# శాంతి

'అడుగు'

'అడగడంకాదు, అర్థించడం'

'సరేలే. చెప్పు.'

క్షణం ఆలోచించి అంది శాంతి— 'మనం వెళ్లిపోదాం బావా!'

'శాంతి!...'

శాంతి ఏమీ మాట్లాడలేదు.

'శాంతీ–నిజం చెబుతాను నేను నాతోటి మగవాడికి అన్యాయం చేయలేను. వెళ్లిపోగలమనేది కలలోని మాట......ఎల్లుండే నీ పెళ్లి, ఆ విషయం మర్చిపోకు'

శాంతి చిన్నగ నవ్వింది.

'ఎలా మర్చిపోతాను బావా! మీరంతా నా పెళ్లికేగా వచ్చింది!'

శాంతి లేచి నిలబడింది. నేనూ లేచాను.

తలుపుదాక వెళ్లి, మళ్లీ వెనుదిరిగి హఠాత్తుగ నాపాదాలకు వందనం చేసింది.

ఆ ఆశ్చర్యంనుండి తేరుకునే సరికే శాంతి వెళ్లిపోయింది.

* * *

తెల్లగ తెల్లవారింది.

రాత్రి సరిగ నిద్రలేకపోవడంతో కళ్లు మండుతున్నాయి—లేచీ లేవగనే నన్నాకర్షించింది రెపరెప లాడుతూ టేబుల్ మీదనున్న కాగితం.

ఎందుకో కీడే శంకించాను — ముందు శ్రీహరికేసి చూశాను, వాడింకా నిద్రపోతున్నాడు.

కాగితం అందుకొని మడత విప్పాను.

'బావా!

నువ్వింతగ ఎదిగిపోయావని — ముఖ్యంగా నాకూ, నా కలలకూ, నా ఊహలకూ కూడ అందనంతగ—ఎదిగిపోయావని ఊహించుకోలేక పోయాను.

అందుకే నిన్నరాత్రి అంత ధైర్యంగా నిన్ను అడగగలిగాను. కానీ నా దురదృష్టం— నువ్వు నీతోటి మానవుడికి అన్యాయం చెయ్యడం నీవల్ల సాధ్యమవదని చెప్పావు. కానీ నీకు అబద్ధం చెప్పడం, ఆత్మవంచన చేసుకోవడంకూడ రాదని నాకు నిన్ననే తెలిసింది—రెండుసార్లు నేను రావటం, నువ్వు నిద్దరాక దొర్లటం చూశాను— ఎలాగైతేనేం నిద్రపోగలిగావు.

కానీ నేను నిద్రపోలేను—నన్ను నేను వంచించుకోలేను గనుక! నీలా ఆత్మవంచన చేసుకోవడమూ తెలియలేదు; మా నాన్నలాగ అబద్ధాలాడి జీవించడమూ చేతకాలేదు.

నిజం బావా! ఈ జీవితం నేనూహించింది కాదు. నా కలల స్వరూపం ఇది కాదు, ఇలా భయంకరంగా మారటంకన్నా నా కల కలగానే ఉండటం నాకిష్టం. కానీ నా జీవితమే, తెల్లారిన తర్వాత భయంకరంగా మారిపోతుంది.

అది నేను భరించలేనిది—

అందుకే — అశాంతితో ఈ శాంతి జీవించలేదు.

మహాలక్ష్మి నాకు జీవితంలో ఇంతటి మార్గదర్శి అవుతుందనుకోలేదు నేను. కానీ అనుకోనివి జరగటమే జీవితం !

అందుకే బావా— తెల్లవారకమునుపే నా జీవితం తెల్లవారిపోతుంది !

నువ్వు అంగీకరించినా, అంగీకరించకపోయినా శాంతి నీ కోసమే చచ్చిపోయిందన్నది నిజం!

ఆఖరిక్షణాల్లో అందర్నీ చూశాననే తృప్తిమాత్రం మిగిలింది.

నమస్కారాలతో,

నీ శాంతి.'

ఉత్తరం చదివాను—ఆ పదాలకు అర్థం తెలియలేదు నాకు.

ఆ అర్థం వెతుక్కుంటూ ఇంట్లోకి వెళ్లాను.

లోనికి వెళ్లగనే అర్థమయింది నాకు శాంతి అన్నదేమిటో !

